

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -144 శుక్రవారం 13 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

జూన్ 2 నాటికి టిమ్స్ పూర్తవ్వాల్సిందే!

డిసెంబర్ నాటికి కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలి

వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్: నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. ఆస్పత్రుల నిర్మాణ పనులకు గడువును నిర్దేశించింది. వచ్చే ఏడాది జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి రాష్ట్రంలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రుల నిర్మాణ పనులు పూర్తి చేసి, పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే కొత్త ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నిర్మాణాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వైద్యారోగ్య శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. **మిగతా 2లో...**

పెట్టుబడిదారులకు భద్రత, భరోసా..



సీఐఐ సదస్సులో దిగ్గజ కంపెనీల ఒప్పందాలు

1,07,693 మందికి ఉద్యోగ అవకాశాలు

గ్రీన్‌కో ఎనర్జీస్, క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ, మేఘా, కియా సంస్థలతోనూ భారీ ఒప్పందాలు

రెన్యువబుల్ ఎనర్జీ, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై పారిశ్రామికవేత్తల ఆసక్తి

రిలయన్స్ పెట్టుబడి రూ.2,73,000 కోట్ల

విశాఖపట్నం, నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):

సాగర తీరాన పెట్టుబడుల వరద ప్రవహించింది. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజునే రిలయన్స్, కియా వంటి దిగ్గజ కంపెనీలు ముందుకు రావడంతో సదస్సు ప్రాంగణంలో పెట్టుబడుల పండగ వాతావరణం కనిపించింది. జనరల్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో రూ.2,73,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. తూర్పు గోదావరి జిల్లాలో ఈ ప్రాజెక్టును ఆ సంస్థ చేపట్టనుంది. సదస్సు తొలిరోజున 88 ప్రతిపాదనలతో కంపెనీలు ముందుకొచ్చాయి. 73 సంస్థలతో రూ.5,84,355 కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా అవగాహన ఒప్పందాలు కుదిరాయి.వాటి ద్వారా 1,07,683 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. **మిగతా 2లో...**

2047కు ముందే వికసిత భారత్

వికసిత భారత్ లక్ష్యం అందుబాటులోనే ఉందన్న ప్రధాని మోదీ

2047 అనేది డెడ్‌లైన్ కాదు, నిరంతర లక్ష్య సాధన మార్గమని వెల్లడి

దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని మీడియాకు పిలుపు

స్వాతంత్ర్య ఉద్యమంలా చిన్న లక్ష్యాలతోనే పెద్ద గమ్యానికి చేరతామన్న ప్రధాని



ఢిల్లీ నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):

'వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా **మిగతా 2లో...**



ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ రాజీనామా

కంపెనీ తాత్కాలిక సీఈఓగా కొలెట్ క్రాస్ నియామకం

వ్యక్తిగత వ్యవహారాలు నిధా ఆరోపణలతో ముదిరిన సంక్షోభం

దాదాపు 7.5 బిలియన్ డాలర్ల చిప్‌ల తరలింపుపై ఎఫ్‌బీఐ దర్యాప్తు

మార్కెట్లో భారీగా పతనమైన ఎన్విడియా షేర్ల విలువ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంలో ప్రపంచ అగ్రగామిగా దూసుకుపోతున్న ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా లో తీవ్ర సంక్షోభం తలెత్తింది. సంస్థ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా భావిస్తున్న ఆలిస్ హువాంగ్ తో ఆయన వివాహేతర సంబంధం నేపథ్యంలో.. **మిగతా 2లో...**

మాజీ మంత్రి శత్రుచర్ల కన్నుమూత

విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 78 ఏళ్ల వయసులో తుదిశ్వాస

ఐదు సార్లు ఎమ్మెల్యే, మూడు సార్లు ఎంపీగా గెలిచిన శత్రుచర్ల

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో 'మన్యం పులి'గా గుర్తింపు పొందిన సీనియర్ నేత



2లో.

ఐపీఎస్ ల బదిలీలు..

తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్ నూతన సీపీగా మహేష్ భగవత్ నియామకం

ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్ బదిలీ

లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్

పోలీస్ శాఖలో సమూల మార్పులు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు





హైదరాబాద్: నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సమూల మార్పులు చేస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు. **మిగతా 2లో...**

ఏఐ ఆధారిత వ్యవసాయ సేవలకు 'భారత్ విస్తార్'

రైతుల ప్రశ్నలకు తెలుగులో వాయిస్ అసిస్టెంట్ సమాధానాలు

వ్యవసాయశాఖ, ఎన్ఐఎస్‌జీ మధ్య అవగాహన ఒప్పందం



హైదరాబాద్, నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):

రైతులకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత సేవలను తెలుగులోనే అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఏఐ ఆధారిత జాతీయ వ్యవసాయ డిజిటల్ వేదిక 'భారత్ విస్తార్'తో తెలంగాణను అనుసంధానించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ (ఎన్ఐఎస్‌జీ) **మిగతా 2లో...**



హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ..

జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం

హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ కేంద్రం ప్రారంభం

మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సరికొత్త కేంద్రం ఏర్పాటు

త్వరలోనే వెయ్యి మంది నిపుణుల స్థాయికి విస్తరణ

ఏఐ క్లౌడ్ ఇంజనీరింగ్‌పై ప్రధాన దృష్టి

హైదరాబాద్, నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):

హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం **మిగతా 2లో...**

తండ్రికి ఆస్తిలో కొడుకుకు జన్మహక్కు ఉండదు



తండ్రికి పంపకాల్లో వచ్చిన ప్రత్యేక ఆస్తిలో కొడుకుకు జన్మహక్కు ఉండదన్న సుప్రీంకోర్టు

తాత ఆస్తి వారసులకు సంక్రమించి వ్యక్తిగత ఆస్తిగా మారితే కుమారుడు అందులో వాటా కోరలేడని స్పష్టీకరణ

హిందూ వారసత్వ చట్టం-1956 ప్రకారం తాత ఆస్తి ఆయన క్లాస్-1 వారసులకు సంక్రమించిందన్న ధర్మాసనం

ఈ మేరకు సగం వాటా కోరిన కొడుకు అప్పీల్‌ను కొట్టివేసిన కోర్టు

2లో.

తండ్రికి ఆస్తిలో కొడుకుకు జన్మహక్కు ఉండదు

ఢిల్లీ నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
తండ్రికి చెందిన ఆస్తిలో కొడుకు జన్మహక్కు కింద వాటా కోరలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తాత నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి పంపకాల తర్వాత తండ్రికి ప్రత్యేక ఆస్తిగా మారితే, అందులో కొడుకుకు పుట్టుకతోనే హక్కు ఏర్పడదని పేర్కొంది. ఈ మేరకు ఆస్తిలో సగం వాటా కోరుతూ దాఖలైన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ కేసు 1997లో దాఖలైన ఆస్తి విభజన వ్యాజ్యానికి సంబంధించినది. 1,811 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి తొలుత తన తాతకు చెందిందని, వారసత్వంగా తనకు జన్మహక్కు వచ్చిందని ఓ మైనర్ బాలుడు కోర్టును ఆశ్రయించాడు. తల్లి ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయించి ఆస్తిలో సగం వాటా కోరాడు. అయితే, ఆ బాలుడు పుట్టకముందే తాత మరణించారని, వారసత్వ ప్రక్రియ ప్రారంభమైందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. తాత ఆస్తిపై 1993లోనే విభజన ప్రక్రియ ప్రారంభమైంది. 1994 జనవరి 6న బాలుడు జన్మించగా, అదే ఏడాది ఫిబ్రవరి 3న ఆస్తి విషయంలో ఒప్పందం కుదిరింది. హిందూ వారసత్వ చట్టం-1956 ప్రకారం తాత ఆస్తి ఆయన క్లాస్-1 వారసులకు సంక్రమించిందని ధర్మాసనం పేర్కొంది. ఆస్తి విభజన తర్వాత ఒక్కొక్కరికి వచ్చిన వాటాలు వారి ప్రత్యేక ఆస్తులుగా మారాయని వివరించింది. ఈ క్రమంలో బాలుడి తండ్రికి వచ్చిన వాటా కూడా ఆయన వ్యక్తిగత ఆస్తిగా మారిందని తెలిపింది. తండ్రి తన వాటాను విక్రయించినప్పటికీ ఆ అమ్మకపు పత్రాలను ఎవరూ సవాలు చేయలేదని కోర్టు గుర్తించింది. పంపకాల్లో తండ్రికి వచ్చిన ఆస్తిపై కుమారుడికి జన్మహక్కు ఉండదని, ఆ ఆస్తిలో అతడు ఉమ్మడి హక్కుదారుడిగా (కోపార్సెనర్) హక్కు పొందలేడని స్పష్టం చేసింది. దీంతో కింది కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంటూ అప్పీల్‌ను కొట్టివేసింది.

ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ రాజీనామా

మొదటి పేజీ తరువాయి
వివాదాలు ముదరడంతో డైరెక్టర్ల బోర్డు ఆయనపై చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే, బోర్డు నిర్ణయం కంటే ముందే జెన్సన్ హువాంగ్ రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో కంపెనీ తాత్కాలిక సీఈఓగా కొలెట్ క్రాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ పరిణామాలకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తే.. నవంబర్ 8న జెన్సన్ హువాంగ్ తాను భార్యకు నమ్మకద్రోహం చేశానని సంస్థ ఉద్యోగులకు స్వయంగా వెల్లడించారు. అయితే ఇందులో విదేశీ నిఘా ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో బోర్డులోని స్వతంత్ర డైరెక్టర్లు విచారణ ప్రారంభించారు. ఎన్విడియా క్లయింట్ అయిన సింగపూర్ సంస్థ మెగాస్పీడ్ ఎగ్జిక్యూటివ్ ఆలిస్ హువాంగ్‌తో ఆయనకున్న సంబంధం ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. ఆమె చైనా నిఘా వర్గాలకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, అమెరికా నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 7.5 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ చిప్‌లను చైనాకు చేరవేయడంలో ఈ సంబంధాన్ని ఉపయోగించుకున్నారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై ఇప్పటికే ఎఫ్‌బీఐ అమెరికా న్యాయశాఖ విచారణ జరుపుతున్నాయి. మొదట్లో హువాంగ్‌కు అండగా నిలిచిన బోర్డు, ఆ తర్వాత ఆయనపై మరో వ్యక్తిగత వివాదం తెరపైకి రావడంతో వైఖరి మార్చుకుంది. ఎన్విడియా వైస్ ప్రెసిడెంట్ (హెల్త్‌కేర్) కింబర్లీ పావెల్‌తో కూడా ఆయనకు సంబంధం ఉన్నట్లు నివేదికలు రావడంతో డైరెక్టర్ల బోర్డు అత్యవసరంగా భేటీ అయింది., ఈ వ్యవహారంపై కాంగ్రెస్‌కు సమగ్ర వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎన్విడియాను తిరుగులేని సాంకేతిక శక్తిగా నిలబెట్టిన జెన్సన్ హువాంగ్ ఒక్కసారిగా పదవీచ్యుతుడు కావడం ప్రపంచ టెక్ రంగాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసింది.

ఏఐ ఆధారిత వ్యవసాయ సేవలకు 'భారత్ విస్తార్'

మొదటి పేజీ తరువాయి
మధ్య గురువారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. సాధారణంగా రైతులు పంటల సాగు, వాతావరణం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల సమాచారం కోసం వివిధ కార్యాలయాలు, వెబ్‌సైట్లు, యాప్‌లపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా భారత్ విస్తార్ ఒకే డిజిటల్ వేదిక ద్వారా అవసరమైన సమాచారం అందిస్తుంది. ఈ వేదికలో పొందుపరిచిన 'భారతి' అనే కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ అసిస్టెంట్... రైతులతో సంభాషిస్తూ వారి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది. రైతులు తమకు ఎదురైన సమస్యలను వారి మాతృభాషలో మాట్లాడి లేదా టైప్ చేసి అడగవచ్చు. రైతు అడిగిన ప్రశ్నను విశ్లేషించి, అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారం, ప్రభుత్వ డేటా ఆధారంగా సూచనలు అందించడం దీని ప్రత్యేకత. భారత్ విస్తార్‌లో ఆరు కీలక సేవలు అందుబాటులో ఉంటాయి. మొదటి దశలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న జాతీయ చాట్‌బాట్, వాయిస్ బాట్ సేవలను తెలుగులో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రత్యేక రాష్ట్రస్థాయి పోర్టల్, తెలుగు యాప్‌ను 15 నుంచి 21 రోజుల్లో అందుబాటులోకి తెచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా రైతులు తమ సందేహాలను పంపించి సమాధానాలు పొందే సదుపాయాన్ని 45 నుంచి 60 రోజుల్లో ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించారు. వచ్చే 6 నెలల నుంచి ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, వ్యవసాయశాఖ సర్క్యులర్లను దశలవారీగా ఈ వేదికలో చేర్చనున్నారు. భారత్ విస్తార్ వేదికను రాష్ట్ర రైతులకు మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.

మాజీ మంత్రి శత్రుచర్ల కన్నుమూత

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు (78) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో ఉత్తరాంధ్ర రాజకీయాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం చినమేరంగి సంస్థానాధీశుడైన శత్రుచర్ల విజయరామరాజు 1948 ఆగస్టు 4న జన్మించారు. నాలుగు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన ఆయన, ఉత్తరాంధ్ర ప్రజలకు సుపరిచితులు. నియోజకవర్గ సమస్యలపై గళమెత్తి ఆయన ప్రజల మన్ననలు పొందడంతో పాటు, రాజకీయ వర్గాల్లో 'ఉత్తరాంధ్ర టైగర్', 'మన్యం పులి'గా గుర్తింపు పొందారు. శత్రుచర్ల విజయరామ రాజు తన రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులు నిర్వహించారు. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు పార్వతీపురం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా విజయం సాధించారు. 1978లో జనతా పార్టీ తరపున నాగూరు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, అనంతరం కాంగ్రెస్, టీడీపీల్లో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా, కొణిజేటి రోశయ్య కేబినెట్‌లో రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత 2017లో టీడీపీ తరఫున శ్రీకాకుళం స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై 2023 వరకు కొనసాగారు. శత్రుచర్ల విజయరామరాజు భార్య రాణి శశికళాదేవి. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, పార్టీల నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలకు సంబంధించిన వివరాలు కుటుంబ సభ్యులు త్వరలోనే వెల్లడించనున్నారు.

జూన్ 2 నాటికి టిమ్స్ పూర్తవ్వాల్సిందే!

మొదటి పేజీ తరువాయి
సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆస్పత్రులకు ఒకే నియామక విధానం అమలు చేయాలని సీఎం సూచించారు. ఈ మూడు ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, ఇతర సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా పరస్పరం బదిలీ చేసుకునే విధంగా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో శాశ్వత వైద్యుల నియామకాలు పూర్తయ్యే వరకు బయట నుంచి వైద్యులను నియమించుకోవాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం, వైద్య పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలను సమాంతరంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
నిమ్స్ ఆస్పత్రిపై రోగుల ఒత్తిడిని తగ్గించేందుకు సనత్‌నగర్ టిమ్స్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. నిమ్స్‌లో పడకలు అందుబాటులో లేకపోయినా, శస్త్రచికిత్సలు ఆలస్యమవుతున్నా అర్హులైన రోగులను సనత్‌నగర్ టిమ్స్‌కు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకోసం నిమ్స్, టిమ్స్ యాజమాన్యాల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని
ఆస్పత్రుల నిర్వహణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. హౌస్‌కీపింగ్, ఇతర నిర్వహణ బాధ్యతలను పూర్తిగా ఔట్‌సోర్సింగ్ సంస్థలకు అప్పగించాలని సూచించారు. వైద్యులు పరిపాలనా వ్యవహారాలతో సమయం వృథా చేసుకోకుండా పూర్తిగా రోగులకు వైద్య సేవలు అందించడంపైనే దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టిమ్స్ ఆస్పత్రుల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమించాలని, హౌస్‌కీపింగ్ సిబ్బంది పనితీరును పర్యవేక్షించేందుకు రిటైర్డ్ సైనిక అధికారుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.
రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న డయాలసిస్ కేంద్రాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 16 కొత్త డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు వివరించగా, నిర్మాణంలో ఉన్న మరో 79 కేంద్రాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. టిమ్స్ ఆస్పత్రులకు అనుబంధంగా నిర్మిస్తున్న వైద్య, నర్సింగ్ కళాశాలల పనులను కూడా సమాంతరంగా పూర్తి చేసి అవసరమైన పరికరాలను సమకూర్చాలన్నారు.మైన నిధులను విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

పెట్టుబడిదారులకు భద్రత, భరోసా..



మొదటి పేజీ తరువాయి
ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 15 జీవోలు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌ల సమక్షంలో ప్రముఖ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ తో పాటు గ్రీన్ కో ఎనర్జీస్, క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ ఫ్రా, కియా ఇండియా తదితర భారీ సంస్థలు వీటిలో ఉన్నాయి. అత్యధికంగా జనరల్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో 23 ఎంఓయూలు కుదిరాయి. తద్వారా రూ.3,57,386 కోట్ల పెట్టుబడులకు సంతకాలు జరిగాయి. వాటి వల్ల 44,838 మందికి ఉపాధి లభించనుంది. రష్మి మెటలర్జికల్ ఇండస్ట్రీస్ రూ.18,500 కోట్లు, జెఎస్ డబ్ల్యు రూ.15 వేల కోట్లు పెట్టనున్నాయి. ఇంకా.. **రెన్యువబుల్ ఎనర్జీ :** ఈ రంగంలో ఏడు ఎంఓయూలు కుదిరాయి. వాటి ద్వారా రూ.1,65,020 కోట్లు పెట్టుబడులు, ఆయా సంస్థల్లో 16,600 మందికి ఉద్యోగాలు కొత్తగా రానున్నాయి. గ్రీన్ కో ఎనర్జీస్ రూ.45 వేల కోట్లు, క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ రూ.41వేల కోట్లు, కృష్ణా జిల్లాలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా రూ.36 వేల కోట్లు పెడుతున్నాయి. కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్: ఈ రంగంలో ఆరు ఎంఓయూల ద్వారా పెట్టుబడులు రూ.19,995 కోట్లు, 3,127 ఉద్యోగాలు వస్తాయి. గెయిల్ ఇండియా రూ.13,500 కోట్లు (శ్రీకాకుళం), ఎన్ఏఎన్ మ్యాగ్నాటెక్ రూ.3 వేల కోట్లు (నెల్లూరు), ఎన్ఏఎన్ సైలాక్స్ గ్రీన్‌మెట్ తిరుపతిలో రూ.1,800 కోట్లు పెడతాయి.
ఫుడ్ ప్రాసెసింగ్: ఈ రంగంలో ఐదు ఎంఓయూల ద్వారా రూ.4,770 కోట్ల పెట్టుబడులు, 2,847 ఉద్యోగాలు వస్తాయి. ఎస్ఎల్ఎన్ కాఫీ నెల్లూరులో రూ.2,500 కోట్లు, హిందూస్థాన్ కోకా-కోలా బేవరేజెస్ రూ.1,127 కోట్లు, శ్రీ వసుధ ఫుడ్స్ అనంతపురంలో రూ.400 కోట్లు పెడతాయి. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులకు ఎక్కువ సహకారం
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ అవకాశాల గని లాంటిదని, ఉన్నతమైన ఆలోచనలతో ముందుకొచ్చి కలలను సాకారం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో గురువారం మొదలైన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం పూర్తి భద్రత, భరోసా ఇస్తుందన్నారు. ఏపీ 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతంతో తూర్పు ఆసియా దేశాలకు ముఖద్వారంగా ఉందన్నారు.
వినూత్న ఆలోచనలు, ప్రతిభ కలిగిన యువతకు ఇక్కడ కొదవ లేదన్నారు. ఇక్కడికి వచ్చే పెట్టుబడుదారులు పూర్తి సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు సీఐఐ సదస్సుల ద్వారా 714 సంస్థలతో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా ఒప్పందాలు జరిగాయని పవన్ వివరించారు. వాటి ద్వారా 19.6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఈ సదస్సుకు ముందు కాకినాడలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో 15 ఒప్పందాల ద్వారా రూ.4,256 కోట్ల పెట్టుబడులతో 14 వేల మందికి ఉద్యోగాలు వచ్చేలా సంతకాలు జరిగాయన్నారు.

అభివృద్ధిలో మోదీ-బాబుది 'ఆర్ఆర్ఆర్' జోడీ..
సీఎం చంద్రబాబుపై గోయెల్ ప్రశంసల వర్షం



ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ నగరం ఇకపై కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భాగస్వామ్య సదస్సులకు శాశ్వత వేదికగా మారనుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయెల్ కీలక ప్రకటన చేశారు. విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై ప్రశంసల వర్షం కురిపించారు. అభివృద్ధి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుల పనితీరును 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని నీరు, నిప్పుతో పోలుస్తూ, ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.

ఐపీఎస్ ల బదిలీలు..

మొదటి పేజీ తరువాయి
ఈ బదిలీల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త సారథి వచ్చారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ సీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు.
అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియమితులయ్యారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది.

బదిలీ అయిన 21 మంది ఐపీఎస్ అధికారులు - వారి కొత్త బాధ్యతలు:

1. మహేశ్ మురళీధర్ భగవత్ (1995 బ్యాచ్): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్
2. వీసీ సజ్జనార్: డీజీ (తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ & సివిల్ డిఫెన్స్), ఎస్‌పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు
3. డా. సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్): డీజీపీ (మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా), ఏడీజీపీ (ఆర్గనైజేషన్ & లీగల్)గా అదనపు బాధ్యతలు
4. స్వాతి లక్రా (1995 బ్యాచ్): జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు
5. చారు సిన్హా (1996 బ్యాచ్): ఏసీబీ డైరెక్టర్ జనరల్, సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు
6. డా. అనిల్ కుమార్ (1996 బ్యాచ్): టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
7. వై. నాగిరెడ్డి (1997 బ్యాచ్): పౌరసరఫరాల శాఖ కమిషనర్ & ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ (+ లీగల్ మెట్రాలజీ)
8. విక్రమ్ సింగ్ మాన్ (1998 బ్యాచ్): గ్రేహౌండ్స్ & ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగం
9. ఎం. స్టీఫెన్ రవీంద్ర (1999 బ్యాచ్): టీజీ-టీఎంఏఆర్ఎస్ (౦+౼హీూ౼ూ) డైరెక్టర్
10. అకున్ సబర్వాల్ (2001 బ్యాచ్): అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్), కోఆర్డినేషన్ & టెక్నికల్ సర్వీసెస్
11. సంజయ్ కుమార్ జైన్: అదనపు డీజీపీ (ట్రైనింగ్) - అదనపు బాధ్యతలు
12. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (2004 బ్యాచ్): డైరెక్టర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)
13. కార్తికేయ (2006 బ్యాచ్): ఐజీ (మల్టీ జోన్-1), ఐసీసీసీ డైరెక్టర్
14. కె. రమేష్ నాయుడు (2006 బ్యాచ్): రైల్వేస్ ఐజీ
15. డి. జోయల్ డేవిస్ (2010 బ్యాచ్): టీజీ-టీఎంఏఆర్ఎస్ రోడ్ సేఫ్టీ & ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు
16. జి. చందన దీప్తి (2012 బ్యాచ్): జోన్-7 (జోగులాంబ/గద్వాల) డీఐజీగా అదనపు బాధ్యతలు
17. ఆర్. భాస్కరన్ (2012 బ్యాచ్): డీఐజీ (ఇంటెలిజెన్స్)
18. కె. నారాయణ నాయక్ (2009 బ్యాచ్): జోన్-2 (బాసర) డీఐజీగా అదనపు బాధ్యతలు
19. ఎల్.ఎస్. చౌహాన్ (2009 బ్యాచ్): డీఐజీ (కోఆర్డినేషన్), జోన్-6 డీఐజీగా అదనపు బాధ్యతలు
20. శ్రీబాలా దేవి: టీజీ-టీఎంఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)
21. వి. అరవింద బాబు: హైదరాబాద్ సిటీ డీసీపీ (ఎస్ఎం & ఐటీ)

2047కు ముందే వికసిత భారత్

మొదటి పేజీ తరువాయి
తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు" అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. "ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా? గత 12 ఏళ్లలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యూపీఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?" అని ప్రధాని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. "మిత్రులారా.. 12 ఏళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవారు" అని ఆయన గుర్తుచేసుకున్నారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పును కూడా మోదీ వివరించారు. "ఒకప్పుడు ప్రతి నాయకుడు ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలిస్తామని నినదించేవారు. అది ఒక మంత్రంలా ఉండేది. ప్రతి ఎన్నికలోనూ పేదరికాన్ని పోగొడతామని హామీలు ఇచ్చేవారు. కానీ నేడు, పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు. పేదరికం తగ్గుముఖం పట్టడం మనం చూస్తున్నాం" అని తెలిపారు. వికసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. "సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని పేర్కొన్నారు. భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. "21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ 'ఇండియా స్టోరీ' ఉంది. నా 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది" అని ప్రధాని కోరారు. అనంతరం దీపావళి, నవరాత్రి, ఛఠ్ పూజ పండుగల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ..

మొదటి పేజీ తరువాయి
తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు.
ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 13 నవంబర్ 2026

భార్యతో గొడవ.. యువకుడి ఆత్మహత్య



వర్ధన్నపేట/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణంలోని ఎస్సీ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యతో గొడవపడిన మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం. కాలనీకి చెందిన ఒంగూరి శ్రీకాంత్ (27) వంట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యపానం విషయంలో భార్య సౌమ్య (24)తో తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నవంబర్ 11న రాత్రి వంట పని ముగించుకుని ఇంటికి వచ్చిన శ్రీకాంత్‌తో భార్య గొడవపడింది. అనంతరం ఆమె పక్కింటికి వెళ్లింది. రాత్రి 9 గంటల సమయంలో శ్రీకాంత్ ఇంట్లో ఒంటరిగా ఉండటంతో అనుమానం వచ్చిన భార్య, పక్కింటి వ్యక్తి అనిల్‌ను వెళ్లి చూడాలని కోరింది. అనిల్ వెళ్లి చూడగా శ్రీకాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు అతడిని కిందకు దించి, అన్న రాజశేఖర్ సహాయంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్న రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యతోనే మాదిగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి. -బిర్రు మహేందర్ మాదిగ





భువనగిరి/ నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): మాదిగ విద్యార్థులు విద్యకు ప్రాధాన్యమిస్తూ, ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. భువనగిరిలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనంలో దుబ్బ రామకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెస్ఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 32 ఏళ్లుగా చేసిన పోరాటం మాదిగ, పీడిత వర్గాల భవిష్యత్తు కోసమేనని అన్నారు. వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెస్ఎఫ్ భువనగిరి నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా ఎర్ర శివ మాదిగ, వలిగొండ మండల కన్వీనర్‌గా కందుల శివ మాదిగ, భువనగిరి పట్టణ కన్వీనర్‌గా బుసపాక సంతోష్ కుమార్ మాదిగ ఎన్నికయ్యారు. కో-కన్వీనర్లుగా జనక్ రాజు, అజయ్, అక్షిత్ మాదిగలు, భువనగిరి మండల అధ్యక్షుడిగా గాదె సూర్యప్రకాష్ మాదిగ, అధికార ప్రతినిధిగా మోత్కూర్ లోకేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బుగ్గ సూర్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా అల్లంపల్లి దుర్గ మాదిగ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, భువనగిరి మండల అధ్యక్షుడు సిర్పంగా కుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడు పల్లెపాటి రాజలింగం మాదిగ, పట్టణ అధ్యక్షుడు అందె సాయి మాదిగ, కోళ్ల జహంగీర్ మాదిగ, కోట ఉపేందర్ మాదిగతో పాటు వివిధ మండలాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చుంచనకోటలో సామాజిక నీటి తొట్టి నిర్మాణానికి శ్రీకారం

వేసవిలో పశుపక్షాదుల దాహార్తి తీర్చేందుకు ఉపయోగం



జనగామ/చేర్యాల, నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): వేసవి కాలంలో పశుపక్షాదుల దాహార్తిని తీర్చేందుకు సామాజిక నీటి తొట్టి ఎంతగానో ఉపయోగపడుతుందని చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ అన్నారు. వీబీజీ రామ్-జీ పథకంలో భాగంగా కమ్యూనిటీ నీటి తొట్టెల (క్యాటిల్ ట్రఫ్స్) నిర్మాణానికి గురువారం మండలంలోని చుంచనకోట గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ముగ్గు పోసి పనులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సామాజిక నీటి తొట్టి వచ్చే వేసవిలో పశువులు, పక్షుల దాహార్తిని తీర్చేందుకు దోహదపడుతుందని తెలిపారు. గ్రామంలో పశు పక్షాదులకు నీటి కొరత లేకుండా ఈ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య, ఏపీవో దివ్య, సాంకేతిక సహాయకుడు రాజకుమార్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, శీర్ల శ్రీకాంత్, మంద వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





పర్వతగిరి/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాప్రతినిధులతో సమీక్షించారు.
గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి



సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.
ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు సావిత్రి, కల్లెడ పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి, పర్వతగిరి సర్పంచ్ శంకర్, వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి


చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్




జనగామ/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్ అన్నారు. జనగామ జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో సర్పంచ్ జానకి కృష్ణలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఎస్ఐ గూడా అపూర్వ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండటంతో పాటు హెల్మెట్ ధరించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు అప్పగించవద్దని, వారు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గ్రామాల్లో నిషేధిత మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కనకయ్య, గ్రామ కార్యదర్శి లోకేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు

మనుగొండ వివాదంపై గీసుగొండ పోలీసుల వివరణ


Telangana State Police Department
Reception Centre Acknowledgement
Contact the Below Officers for any Assistance
Office Number
Mobile Number
SHO
ACP





గీసుకొండ/ నవంబర్ 12 (జర్నలిస్టు వార్త): మనుగొండ గ్రామంలో మాదాసి పూర్ణిమ, కాయిత అఖిల్ మధ్య జరిగిన వివాదంపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు విచారణ జరిపి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. పోలీసులు స్పందించలేదంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.
పోలీసుల వివరాల ప్రకారం. నవంబర్ 8న రాత్రి 9 గంటల సమయంలో ఇరువర్గాల ఇళ్ల ముందు చెత్తను పారవేసే విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఇరువర్గాల వారు పరస్పరం వాగ్వాదానికి దిగి అసభ్య పదజాలంతో దూషించుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.
మనుగొండ గ్రామంలో మాదాసి పూర్ణిమ, కాయిత అఖిల్ మధ్య జరిగిన వివాదంపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు విచారణ జరిపి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. పోలీసులు స్పందించలేదంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.
పోలీసుల వివరాల ప్రకారం. నవంబర్ 8న రాత్రి 9 గంటల సమయంలో ఇరువర్గాల ఇళ్ల ముందు చెత్తను పారవేసే విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఇరువర్గాల వారు పరస్పరం వాగ్వాదానికి దిగి అసభ్య పదజాలంతో దూషించుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. మరుసటి రోజు పూర్ణిమ, అఖిల్ ఇరువురూ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారని తెలిపారు. పూర్ణిమ తనను అసభ్యంగా దూషించి, అవమానించడంతోపాటు దాడికి యత్నించి బెదిరించారని ఫిర్యాదు చేయగా, ఇరువర్గాల ఫిర్యాదులపై ఎస్సై అనిల్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారని వెల్లడించారు. విచారణలో వెల్లడైన అంశాలు, వర్తించే చట్ట నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని పూర్ణిమ కోరినప్పటికీ, చట్టప్రకారం తీసుకున్న చర్యలపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేయడంతో పాటు ఉన్నతాధికారులకు, మీడియా ప్రతినిధులకు ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదనే అభిప్రాయం కలిగేలా సమాచారం పంపినట్లు పేర్కొన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో సీఐ ఆదేశాల మేరకు ఎస్సై రవికుమార్ పూర్ణిమ ఇంటికి వెళ్లి, ఇరువర్గాల ఫిర్యాదులు, విచారణ వివరాలు, తీసుకున్న చర్యలను వివరించినట్లు తెలిపారు. తదుపరి విచారణ కొనసాగుతోందని, అవసరమైన ఆధారాలు సేకరించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ విశ్వేశ్వర్ వెల్లడించారు. ఇరువర్గాల ఫిర్యాదులను సమానంగా పరిగణించి నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని, పోలీసులు చర్యలు తీసుకోలేదనే ప్రచారం వాస్తవం కాదని సీఐ స్పష్టం చేశారు.

హసన్‌పర్తి నూతన మీడియా కమిటీ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



హసన్‌పర్తి/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): హసన్‌పర్తి మండల నూతన మీడియా కమిటీ సభ్యులు గురువారం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా ఏర్పాటైన మీడియా కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హసన్‌పర్తి మండల నూతన మీడియా కమిటీకి ఎల్లవేళలా తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తాళ్ల జోసెఫ్‌ను పరామర్శించిన జక్కంపూడి కిషోర్



తాళ్లాడ/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): తాళ్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ ప్రమాదవశాత్తు కాలు జారి పడటంతో కుడికాలుకు గాయమైంది. దీంతో ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించగా, ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జక్కంపూడి కిషోర్ గురువారం తాళ్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జోసెఫ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ శ్రీనివాసరావు, జక్కంపూడి రమేష్, మేడ అర్జున్ రావు, తాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయడమే లక్ష్యం

ఈ నెల 22న హనుమకొండలో నిర్వహించే సభకు పెద్దఎత్తున తరలిరావాలి -స్వేరో నాయకుల పిలుపు



హసన్‌పర్తి/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): ఈ నెల 22న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న స్వేరో ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయడమే లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట నియోజకవర్గ స్వేరో నాయకులు తెలిపారు. నియోజకవర్గ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఊరిబిండి ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ కన్వీనర్ చాతల్ల వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని పైడిపల్లి, ఆరేపల్లి, వంగపాడు, సిద్ధాపూర్ గ్రామాల్లో విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి సమ్మేళన గోడపత్రికలను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 22న హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించే స్వేరో ఆత్మీయ సమ్మేళనానికి స్వేరో ఇంటర్నేషనల్ ఫౌండర్, సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ (అదనపు డీజీపీ, స్వచ్ఛంద పదవీ విరమణ) ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువత, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్వేరో అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ నాగరాజు, మంద స్టాలిన్, చింత శ్రీనివాస్, పంగ అఖిల్, దోమ శంకర్, చీకటి రమేష్, బొక్క రమేష్, బొక్క జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



పరకాల/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):పరకాల పట్టణంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఆర్వో నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు బుజ్జ హేమంత్, మండల ఉపాధ్యక్షుడు రాహుల్, పట్టణ కార్యదర్శి అప్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంగా ఆకునూరు అంగన్‌వాడీ కేంద్రం

స్వచ్ఛమైన ఆకుకూరలు, కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న టీచర్ ఉమారాణి

జనగామ/చేర్యాల, నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):



విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ఆకునూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రకృతి వనంగా తీర్చిదిద్ది అంగన్‌వాడీ టీచర్ తాటికొండ ఉమారాణి ఆదర్శంగా నిలుస్తున్నారు. సిద్ధిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ రకాల పండ్ల మొక్కలు, ఆకుకూరలు, కూరగాయలు, పూల మొక్కలను పెంచుతూ చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు.అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి, ఎర్ర మట్టిని తీసుకువచ్చి మొక్కలు నాటడంతోపాటు ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో జామ, బొప్పాయి, మునగ, నిమ్మ, మామిడి, దానిమ్మ, మిరప, కలబంద, కరివేపాకు, పుదీనా వంటి మొక్కలతో పాటు చామంతి, గులాబీ, గోరింటాకు, బంతి, గన్నేరు, మందారం, లిల్లీ తదితర పూల మొక్కలను పెంచుతున్నారు.

గతంలో తోటలో మొక్కలకు నీటి ఎద్దడి కారణంగా ఇబ్బందులు ఎదురయ్యేవని ఉమారాణి తెలిపారు. చిన్నారులకు స్వచ్ఛమైన ఆకుకూరలు, కూరగాయలు అందించాలనే సంకల్పంతో తోటను అభివృద్ధి చేస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన బీర గణేష్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ కొమ్ము రవి వాటర్ ట్యాంక్ నుంచి నీటి కనెక్షన్ ఏర్పాటు చేయించడంతో ప్రస్తుతం నీటి సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేశారు.అంగన్‌వాడీ కేంద్రంలో పండించే సహజసిద్ధమైన ఆకుకూరలు, కూరగాయలతో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు మొక్కల పెంపకంపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. భవిష్యత్తులో ఈ ప్రకృతి వనాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఉమారాణి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ ఉమారాణి చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.

పలు కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.. వాణి పిల్లలకు ఆర్థిక సహాయం



తల్లాడ/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):తల్లాడ మండలం తెలగవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ గురువారం పరామర్శించారు. పర్యటనలో భాగంగా గ్రామ సర్పంచ్ కాళోజి అన్నయ్య కుటుంబానికి చెందిన కీర్తిశేషులు భూక్య లాలు పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు

సింగపురం ఇందిరకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సింగపురం వెంకటయ్య



స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిర జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు సింగపురం వెంకటయ్య ఇందిరకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఇందిరకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింగపురం నాగయ్య, కొత్తపెళ్లి భిక్షపతి, వసంత్, నలిమెల ఏలియా, తాటికొండ సంపత్, కల్లకోలు బాలరాజు, మహిళా అధ్యక్షురాలు జోత్స్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐ అరుణ్‌కు ఘన సన్మానం



స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ గూడ అరుణ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, రంగరాయిగూడెం సర్పంచ్ జూలుకుంట్ల శిరీష్ రెడ్డి మండల సర్పంచులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజాప్రతినిధులు సహకరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీది కొండ, తానేదారుపల్లి, తాటికొండ, చంద్రు తండా గ్రామాలకు చెందిన సర్పంచులు జోగు సంపత్ కుమార్, మంతెన హరిత, ఇంద్రసేనారెడ్డి, సుజన, శ్రీనివాస్‌తో పాటు నాయకులు ఇంద్రారెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం సహాయ కేంద్రం



పరకాల/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు సహకరించేందుకు పరకాల పట్టణంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి బొచ్చు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై సహకారం అందించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు జలుగురి రమేష్, మంద నరేష్, బొచ్చు రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు అందించడమే లక్ష్యం

రూ.3.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ -కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్

జనగామ / నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందించడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. జనగామ జిల్లాలోని నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు బాధితులకు బుధవారం ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.నర్మెట మండల కేంద్రానికి చెందిన మంకెన ఆగారెడ్డి, పాతూరి లక్ష్మారెడ్డి, అమ్మాపూర్‌కు చెందిన ఆరే భాస్కర్, హనుమంతపూర్‌కు చెందిన ఇట్టబోయిన రాజశేఖర్, దొంగచెలిమి తండాకు చెందిన మాలోతు కనకయ్య, తరిగొప్పుల మండలం సోలిపూర్‌కు చెందిన బత్తుల కనకయ్యలకు మొత్తం రూ.3.50 లక్షల



విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.
ఈ సందర్భంగా నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.
సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం మంజూరుకు సహకరించిన భువనగిరి ఎంపీ శ్యామల, నాగపురి కిరణ్ కుమార్ గౌడ్‌లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వెల్దండ సర్పంచ్ రేఖ బాపురాజు, చేర్యాల ఈఎంసీ డైరెక్టర్ కన్యబోయిన రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, కోశాధికారి మధు, ఎర్రగుంట సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు బండి అశోక్, బోలుగం రాజు, కళ్యాణం మురళి, పలువురు కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరజీవి తోకల కొమరారెడ్డి ఆశయాలను కొనసాగించాలి

శ్రమదోపిడీ లేని సమసమాజ నిర్మాణమే నిజమైన నివాళి

సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి



హసన్‌పర్తి, నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
సామాజిక రుగ్మతలు, కులవివక్ష, అవినీతి, లంచగొండితనం, శ్రమదోపిడీ నిర్మూలనతో పాటు భూమిలేని పేదలకు భూమి పంచాలని, కార్మికులకు న్యాయమైన వేతనాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సాగిస్తున్న పోరాటాలకు ఆకర్షితుడై కామ్రేడ్ తోకల కొమరారెడ్డి ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై వీరోచిత పోరాటాలు నిర్వహిస్తూ వర్గపోరాటంలో అమరుడయ్యారని వారు పేర్కొన్నారు.
గురువారం హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో మండల సీపీఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన కామ్రేడ్ తోకల కొమరారెడ్డి 47వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రమదోపిడీ లేని సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తోకల కొమరారెడ్డి ఆశయాలను ఆచరణలో కొనసాగించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.ముందుగా కొమరారెడ్డి స్తూపానికి సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో నివారణ చర్యలను ప్రభుత్వం వేగవంతం చేయాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, వ్యవసాయ కూలీలకు కరువు సాయం, కార్మికులకు ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కొమరారెడ్డి కుమారుడు తోకల అంశారెడ్డి ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోకల అంశారెడ్డి, తోకల కార్తీక్‌రెడ్డి, ముజ్జిగ పరశురాములు, కల్వచర్ల వెంకటేశ్వర్లు, ముజ్జిగ అజయ్, నాంపల్లి లక్ష్మయ్య, మల్లారెడ్డి, కొత్తగట్టు శ్యాంసుందర్, న్యాతకాని రాజయ్య, రేణిగుంట్ల రాజయ్య, ప్రజా కళాకారుడు గద్దర్ సాంబన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలకు వడ్డీ రాయితీ ఇవ్వాలి

పంట నష్టాల నేపథ్యంలో రుణాల వసూళ్లు వాయిదా వేయాలి -సహకార సంఘాల 129వ మహాజనసభలో పలు కీలక తీర్మానాలు

ఖమ్మం/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
రైతుల సమస్యల పరిష్కారం, సహకార సంఘాల బలోపేతమే లక్ష్యంగా ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 129వ మహాజనసభలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పీఐసీ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధ్యక్షతన సభ నిర్వహించారు. 2025-26 వార్షిక నివేదిక, ఖర్చులు, లాభాల కేటాయింపులు, చట్టబద్ధ తనిఖీ నివేదికలను సభ్యులు ఆమోదించారు.

లాభాల పంపిణీకి ఆమోదం

2025-26 సంవత్సరానికి ఏ తరగతి సహకార సంఘాలకు లాభవాటా చెల్లింపు, ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించే అంశాలకు సభ ఆమోదం తెలిపింది. నాబార్డు అంబ్రెల్లా ప్రాజెక్టులో భాగంగా నూతన సీబీఎస్ పినాకిల్ విధానానికి మారడం, సహకార సారథి ప్రైవేట్ లిమిటెడ్‌తో నాబార్డు ఒప్పందం చేసుకునే అంశాలను ఆమోదించారు.

రైతులకు వడ్డీ రాయితీ కల్పించాలి

మోటాపురం సహకార సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ రుణాలపై కేంద్ర ప్రభుత్వం మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నాలుగు శాతం రాయితీ కల్పించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రైతుల రుణాల వసూళ్లపై మారటోరియం ప్రకటించాలని పలువురు సంఘాల అధ్యక్షులు కోరారు.

సంఘాలకు అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు

సహకార సంఘాల ద్వారా పామాయిల్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సంఘాల పరిధిలో సౌర విద్యుత్





కేంద్రాలు నెలకొల్పి విద్యుత్ ఉత్పత్తి ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం కల్పించాలని ప్రతినిధులు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం సరైన మద్దతు ధర కల్పిస్తే దళారుల బారిన పడకుండా రైతులను కాపాడవచ్చని, వారి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.

మత్స్యకారులకూ ఆర్థిక సాయం అందించాలి

మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో మత్స్యకారులు సైతం జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు.

కలెక్టర్‌కు సంఘాల అధ్యక్షుల అభినందనలు

సమావేశానికి హాజరైన సహకార సంఘాల అధ్యక్షులు తమ సమస్యలు, డిమాండ్లను సభ దృష్టికి తీసుకొచ్చారు. బేతుపల్లి చెరువులో నిర్వహించిన సహాయక చర్యల్లో జిల్లా కలెక్టర్ చూపిన చొరవను అభినందించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహించడం ఖమ్మం జిల్లా రైతులకు, సహకార రంగానికి ప్రయోజనకరమని పేర్కొన్నారు. పామాయిల్ సాగు రైతుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని, వారికి ప్రభుత్వం అండగా నిలవడం సంతోషకరమని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

సహకార సంఘాల అధ్యక్షులు లేవనెత్తిన అంశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్. వెంకట ఆదిత్యను ఆదేశించారు. బ్యాంకు తీసుకునే ప్రతి నిర్ణయం రైతుల సంక్షేమం, సహకార సంఘాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే ఉంటుందని వెంకట ఆదిత్య తెలిపారు. సంఘాల అధ్యక్షులు బ్యాంకుతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు.
ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా సహకార అధికారి జి. గంగాధర్ రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి ఏ. శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లారావు, బ్యాంకు డీజీఎం జి. ఉదయశ్రీ, జి. వేణుగోపాల్ రావు, ఎం. సర్వేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆరోగ్యకరమైన అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం -జిల్లా సంక్షేమ అధికారి శిరీష

మహబూబాబాద్/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ సదానందం అధ్యక్షతన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు వ్యక్తిగత, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శిరీష మాట్లాడుతూ బాలికలు పరిశుభ్రతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రుతుక్రమ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లే సంపూర్ణ ఆరోగ్యానికి పునాదులని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రతకు అవసరమైన న్యాప్‌కిన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల నిషేధ చట్టం,



పోక్సో చట్టం, లింగ వివక్షత, మహిళా సాధికారత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు తమ హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో మహిళల పట్ల సమానత్వ భావన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త మహేశ్వరి, లింగ వివక్షత అంశాల నిపుణురాలు అరుణ, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు సంధ్యారాణి, కళాశాల యాజమాన్యం, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ ధరావత్ కైక



కేసముద్రం/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):మహిళా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మహిళలకు పెద్దపీట వేస్తోందని క్యాంపుతండ గ్రామ సర్పంచ్ ధరావత్ కైక అన్నారు. గురువారం మండలంలోని క్యాంపుతండ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మహిళా సంఘం (గ్రామైక్య సంఘం) భవన నిర్మాణ పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం విశేష ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ధరావత్ శేఖర్, మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి, వార్డు సభ్యులు జాటోత్ సురేష్, బానోత్ లాలు, పంచాయతీ కార్యదర్శి మనోజ్, తాడూరి ఉమేష్, ధరావత్ రమేష్, ధరావత్ వీరన్న, ధరావత్ లాలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి -విద్యాసంస్థల తనిఖీలో కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు

మహబూబాబాద్/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం పెదనాగారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ పాఠశాలలతో పాటు నర్సింహులపేటలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ విస్తృతంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివిధ సబ్జెక్టుల్లో వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. జిల్లాలో అమలు చేస్తున్న ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, భాషా నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో





అందిస్తున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను నిర్ణీత సమయంలో విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.
అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థుల మానసిక స్థితిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని, నిర్ణీత గడువులోగా అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.విద్యార్థుల హాజరు శాతాన్ని తప్పనిసరిగా అంతర్జాలంలో నమోదు చేయాలని, వైద్య ఆరోగ్య సిబ్బందితో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీల్లో ఏజీసీ శ్రీరాములు, ఏఎంఓ అప్పారావు, విజయలక్ష్మి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం

జనవిజ్ఞాన వేదిక ప్రతిభా పరీక్ష ప్రశ్నాపత్రం విడుదల



కేసముద్రం/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించి, విజ్ఞానంపై ఆసక్తిని కలిగించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాఠశాల స్థాయి ప్రతిభా పరీక్ష ప్రశ్నాపత్రాన్ని గురువారం కేసముద్రంలోని శ్రీ వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో విడుదల చేశారుఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు, శ్రీ వివేకవర్ధిని విద్యాసంస్థల కరస్పాండెంట్ చిర్రా యాకాంతం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానంపై ఆసక్తి, సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు ఇటువంటి ప్రతిభా పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే లక్ష్యం

పింఛన్ల మంజూరులో టార్గెట్ లేదు.. అర్హతే ప్రామాణికం

ధర్మసాగర్ మండలంలో 729 మందికి కొత్త పింఛన్లు.. నెలకు రూ.18.87 లక్షల పంపిణీ









ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎలాంటి పరిమితి లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తామని తెలిపారు.
ధర్మసాగర్ మండలంలోని సుస్మిత గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన చేయూత నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, రాంపూర్ గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు రూ.19.43 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, 27 మంది లబ్ధిదారులకు రూ.27.03 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తుర్కకాశ గ్రామానికి చెందిన 15 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన పనిముట్లను పంపిణీ చేశారు.

729 మందికి కొత్త పింఛన్లు

ధర్మసాగర్ మండలంలో ఐదు కేటగిరీల కింద మొత్తం 729 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో 370 మంది వితంతువులకు రూ.7,45,920, 209 మంది దివ్యాంగులకు రూ.8,39,344, 44 మంది ఒంటరి మహిళలకు రూ.88,704, 102 మంది గీత కార్మికులకు రూ.2,05,632, నలుగురు చేనేత కార్మికులకు రూ.8,064 చొప్పున నెలవారీ పింఛన్లు అందనున్నాయి. మొత్తంగా ప్రతి నెలా రూ.18,87,664 లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు నాలుగైదేళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కేటగిరీల్లో కొత్తగా 4.50 లక్షల పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న పింఛన్లతో కలిపి సుమారు 45 లక్షల మందికి ఏటా రూ.12 వేల కోట్లతో పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఇంకా అర్హులైన వారు ఎవరైనా మిగిలిపోతే సర్పంచులు, ఎంపీడీవోలు గుర్తించి దరఖాస్తు చేయించాలని సూచించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కొందరు రాజకీయ అక్కసుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం కోల్పోయామన్న అసహనంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశ చూపిన వారు ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. గ్రామాల్లో పర్యటించి సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్ల అమలును పరిశీలించాలని సూచించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.
స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి గత మూడేళ్లలో సుమారు రూ.1,600 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు కడియం శ్రీహరి తెలిపారు. అండర్‌గ్రౌండ్ ఆసుపత్రి, సమీకృత కార్యాలయ సముదాయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యంగ్ ఇండియా సమీకృత పాఠశాలతో పాటు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. రానున్న రెండేళ్లలో ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వ ప్రాధాన్యం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ చారిత్రక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. మహిళలకు సర్పంచులుగా అవకాశాలు వచ్చినప్పుడు వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భర్తలు, స్వతంత్రంగా బాధ్యతలు నిర్వహించేలా ప్రోత్సహించాలని సూచించారు.
బీఆర్ఎస్ కుటుంబంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ప్రస్తావిస్తూ కడియం కావ్య విమర్శలు చేశారు. సొంత కుటుంబానికి చెందిన మహిళే బయటకు వచ్చి కుటుంబంలోని వ్యక్తులపై, రాష్ట్రాన్ని దోచుకున్నారంటూ ఆరోపణలు చేస్తున్న పరిస్థితిని ప్రజలు గమనించాలని అన్నారు. కుటుంబ విషయాలను సాధారణంగా బయటపెట్టని మహిళ సైతం ఇంతలా మాట్లాడుతోందంటే ఆమె ఆవేదనను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతున్న ప్రతికూల ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని, గ్రామగ్రామాన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మైనారిటీల హక్కుల రక్షణకు లౌకిక శక్తులను బలోపేతం చేయాలని కోరారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి ప్రజలు అండగా నిలవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శేషాద్రి, హనుమకొండ డీఆర్‌డీవో శ్రీనివాస్, తహసీల్దార్ భావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మిక ఐక్యవేదిక దామెర గ్రామ అధ్యక్షుడిగా గబ్బిట రవీందర్ ఎన్నిక

ఎన్నికపై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



ఎల్కతుర్తి/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామానికి చెందిన గబ్బిట రవీందర్ చేనేత కార్మిక ఐక్యవేదిక గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్ర నాయకులు వెంకటేష్ వెల్లడించారు. మండలంలోనే అతిపెద్ద గ్రామమైన దామెరకు చెందిన రవీందర్ ఈ బాధ్యతలు చేపట్టడంపై గ్రామస్తులు, కుల సంఘ బాంధవులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ చేనేత కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం రవీందర్ కృషి చేస్తారనే నమ్మకంతో గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.అనంతరం నూతన అధ్యక్షుడు గబ్బిట రవీందర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కుల సంఘ నాయకులు, బాంధవులు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని, ఉద్యమంలో సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు పాటిస్తూ వారి సహకారంతో ఐక్యవేదికను ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. సంఘ సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో కుల సంఘ నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, సంఘ బాంధవులు తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ వైద్య పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలి

వైద్య ఆరోగ్యశాఖపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
జిల్లాలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, వేగవంతమైన, నిరంతర వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ప్రభుత్వ వైద్యం ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఆరోగ్య సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ, చిన్నారుల టీకాల కార్యక్రమం, బీపీ, మధుమేహం నియంత్రణ, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించాలని స్పష్టం చేశారు.
కుష్ట వ్యాధి నివారణతో పాటు 102 వాహనాల వినియోగాన్ని సమర్థవంతంగా చేపట్టాలని, అమ్మఒడి కార్యక్రమం ద్వారా గర్భిణులు, చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులకు తరలించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ఆరు ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు అందించాలని సూచించారు. జాతీయ బాల ఆరోగ్య కార్యక్రమం బృందాలు 18 ఏళ్లలోపు పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్నవారికి అవసరమైన చికిత్సలు అందించాలని ఆదేశించారు.
జిల్లా ఆసుపత్రిలో క్యాన్సర్ బాధితుల చికిత్స కోసం కీమోథెరపీ విభాగాన్ని ఏర్పాటు చేసినందున అర్హులైన రోగులను అక్కడికి సిఫారసు చేయాలని సూచించారు. టీ హబ్ ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని, రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.
జిల్లాలో హెచ్ఐవీ బాధితులను గుర్తించి వారికి సమగ్ర వైద్య సేవలు అందించాలని, పక్షవాతం తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వాహనం ద్వారా ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో చికిత్సలు అందించాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ కేంద్రాల్లో అధిక రక్తపోటు బాధితులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు.
మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారుల టీకాల కార్యక్రమంతో పాటు క్షేత్రస్థాయి వైద్య సేవల్లో మహబూబాబాద్ జిల్లాను ముందువరుసలో నిలపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రస్తుతం జాతీయ ఆరోగ్య మిషన్ సిబ్బంది సమ్మెలో ఉన్నప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ప్రణాళిక ప్రకారం ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని, వాటిని మరింత వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు.. ఆరోగ్యంపై అవగాహన





పర్వతగిరి/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
పర్వతగిరి మండలంలోని పీఎం శ్రీ గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్యాధికారి ఉదయ్ రాజ్ వైద్య సేవలు అందించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్యం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్య నియమాలు పాటిస్తూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు.

ముప్పారం శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయ వైభవానికి విస్తృత ప్రచారం!

కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను కలిసి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

ఆలయ చరిత్ర, అభివృద్ధి లక్ష్యాలను వివరించిన పునఃవ్యవస్థాపకులు



ధర్మసాగర్/ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరోనవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలోని పురాతన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయానికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు ఆలయ విశిష్టతను నలుదిశలా చాటేందుకు పునఃవ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర కృషి చేస్తున్నారు. ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఐఏఎస్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్, జిల్లా అటవీ అధికారి, పర్యాటక శాఖ అధికారి జి. ముకుంద రెడ్డి ఐఎఫ్ఎస్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ ముఖ్యనాథేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాచీన చరిత్ర, విశిష్టత, ప్రాశస్త్యాన్ని అధికారులకు వివరించారు. గత వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన పురాతన ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు చేరువ చేయడంతో పాటు పర్యాటక ప్రాధాన్యత కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ముప్పారం శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయానికి తగిన గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.





ముగ్గురు మంత్రులు ఉన్నా సత్తుపల్లిలో అభివృద్ధి శూన్యం

రైతులను గందరగోళానికి గురిచేయకుండా తక్షణమే ఆర్థిక భరోసా కల్పించాలి

బీజేపీ జాతీయ నాయకుడు డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఘాటు విమర్శలు



సత్తుపల్లి/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):
భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, నున్న రవికుమార్ తదితర నాయకులతో కలిసి సత్తుపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ 25 వేల ఆర్థిక సహాయం అందించారు రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు
అనంతరం బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు సత్తుపల్లి నియోజకవర్గంలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యమని తీవ్రస్థాయిలో విమర్శించారు ముఖ్యమంత్రి ఒక మాట మంత్రులు మరో మాట మాట్లాడుతూ వరి సాగు చేయవద్దని, సాగు చేస్తే విద్యుత్ సరఫరా చేయబోమని ప్రకటిస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు ప్రత్యామ్నాయ పంటల సాగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ముందుగా పెట్టుబడి సాయం, నాణ్యమైన విత్తనాలు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించిన తర్వాతే పంటల మార్పిడిపై మాట్లాడాలని ప్రభుత్వానికి హితవు పలికారు
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు మరోవైపు తుఫాను కారణంగా కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు వేంసూరు మండలాన్ని పూర్తిస్థాయి కరువు మండలంగా ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి తదితర మండలాల్లో క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక సాయం, పంట నష్టపరిహారం అందించాలని కోరారు తెలంగాణలో పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమేనని మండిపడ్డారు
సత్తుపల్లి వేసికాంతల చెరువు సమీపంలోని రెండు పడక గదుల ఇళ్లకు రక్షణ గోడ నిర్మించాలని అర్హులైన నిరుపేదలకే ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు పేదల ఇళ్ల విషయంలోనూ నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు
బుగ్గపాడు ఆహార శుద్ధి పరిశ్రమల పార్కులో దీపక్ నెక్స్ జెన్ కంపెనీకి మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకు భూములు కేటాయించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు ప్రజాధనానికి సంబంధించిన భూముల కేటాయింపుల్లో పారదర్శకత ఎక్కడుందని ప్రశ్నించారు ఈ వ్యవహారంపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ కోరామని అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు నామమాత్రపు ధరకు భూముల విక్రయం వెనుక అక్రమాలు ఉన్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు
కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీల ప్రజలు సింగరేణి సైలో బంకర్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు బంకర్ నిర్మాణంలో నాణ్యతా లోపాలు, కూలిపోవడం, దుమ్ము ధూళి సమస్యలతో ప్రజల ఆరోగ్యం, జీవన పరిస్థితులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు బాధిత కుటుంబాలకు తక్షణమే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు సంబంధిత కాంట్రాక్టర్‌కు జారీ చేసిన ధ్రువపత్రాలు, అధికారుల పదోన్నతులు, నిర్మాణ నాణ్యతపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు
ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రైతులను గందరగోళానికి గురిచేస్తూ పేదల ఇబ్బందులను నిర్లక్ష్యం చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని ప్రజల పక్షాన ప్రభుత్వంపై నిరంతర పోరాటం చేస్తామని డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి హెచ్చరించారు
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ని వీరంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, మండల అధ్యక్షులు బానోతు విజయకుమార్, గుమ్మ రామకృష్ణ, బొర్రా నరసింహారావు, ప్రభాకర్ రెడ్డి, మందా శివ, చీకటి వసంతరావు, కార్తీక్ యాదవ్, రఘునాథరెడ్డి, రహమతుల్లా, కృష్ణయ్య తదితర నాయకులు పాల్గొన్నారు

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు

మంత్రి పొన్నం హెచ్చరిక

ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్న పొన్నం

ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచన

ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్న మంత్రి

ఉచిత బస్సు వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రకటన

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి నియామక పత్రం



ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడులకు దిగవద్దని ప్రజలకు సూచించారు.ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అయితే, ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.
నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఆయన కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగ నియామక పత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ ఇప్పటికే పరిహారం అందించాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం ద్వారా సుమారు రూ.కోటి సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించామని చెప్పారు.

ఖవాజా వ్యాఖ్యలతో మళ్లీ బాల్ ట్యాంపరింగ్ వివాదం

● ఆరోపణలపై స్పందించేందుకు సిద్ధమైన ప్యాట్ కమిన్స్.. శుక్రవారం మీడియా సమావేశం



ఆస్ట్రేలియా క్రికెట్‌లో 2018 బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మాజీ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబర్'లో చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ఆస్ట్రేలియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించేందుకు సిద్ధమయ్యాడు.2018లో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ వ్యవహారంలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే ఈ వ్యవహారం గురించి జట్టులోని అందరికీ తెలుసని, కొందరినే బాధ్యులుగా చేశారని ఖవాజా తన పుస్తకంలో పేర్కొన్నాడు. ఖవాజా వ్యాఖ్యలకు డేవిడ్ వార్నర్ మద్దతు తెలిపాడు. ఆయన చెప్పింది వందశాతం నిజమని సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. మరోవైపు మిచెల్ స్టార్క్ మాత్రం ఈ ఆరోపణలను ఖండించాడు. మైదానంలో బంతిని మార్చేందుకు శాండ్‌పేపర్ తీసుకెళ్లిన విషయం తమకు తెలియదని గతంలో ఇచ్చిన వివరణకే కట్టుబడి ఉన్నట్లు తెలిపాడు. ఈ నేపథ్యంలో ప్యాట్ కమిన్స్ శుక్రవారం సిడ్నీలోని క్రికెట్ సెంట్రల్‌లో ఉదయం 9.30 గంటలకు మీడియాతో మాట్లాడనున్నట్లు ప్రకటించాడు. ఖవాజా చేసిన ఆరోపణల పూర్తి వివరాలను అర్థం చేసుకునేందుకు సమయం తీసుకున్నానని, ఇప్పుడు వాటిపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించాడు.క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ బూన్ మాత్రం కమిన్స్ నాయకత్వానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశాడు. ఈ వివాదంపై మళ్లీ విచారణ జరపాల్సిన అవసరం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా యాజమాన్యం భావిస్తోంది. కమిన్స్ మీడియా సమావేశంలో ఎలాంటి వివరణ ఇస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

ఐపీఎల్‌లో 12 జట్ల విస్తరణకు బ్రేక్!

2028 నుంచి కొత్త జట్లు వస్తాయన్న ప్రచారానికి బీసీసీఐ స్పష్టత.. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ లేదని వెల్లడి..

2027 సీజన్‌పైనే బోర్డు దృష్టి



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన క్రికెట్ లీగ్‌గా గుర్తింపు పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో జట్ల సంఖ్యను పెంచనున్నారన్న ప్రచారానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం ఉన్న పది జట్లను 2028 నాటికి పన్నెండుకు పెంచనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని వెల్లడించింది. ఈ అంశంపై బోర్డులో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేసింది. దీంతో కొత్త ఫ్రాంచైజీల కోసం ఎదురుచూస్తున్న క్రికెట్ అభిమానులకు ప్రస్తుతానికి నిరాశే ఎదురైంది.ఇటీవల ఐపీఎల్‌లో మరో రెండు జట్లను చేర్చనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ముఖ్యంగా పుణె, వడోదర నగరాలకు కొత్త జట్లను కేటాయించే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. దీంతో ఆయా నగరాల్లో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అయితే ఈ వార్తలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించారు. ఐపీఎల్‌ను 12 జట్లకు విస్తరించే విషయంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అనధికారిక చర్చలు కూడా జరగలేదని స్పష్టం చేశారు. **2027 సీజన్‌పైనే బీసీసీఐ దృష్టి**ప్రస్తుతం బీసీసీఐ దృష్టంతా 2027 ఐపీఎల్ సీజన్ నిర్వహణపైనే ఉందని సైకియా వెల్లడించారు. వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ 20వ సీజన్‌ను ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సీజన్‌కు సంబంధించిన ఏర్పాట్లు, ఆటగాళ్ల ఎంపిక, వేలం ప్రక్రియ వంటి అంశాలపై బోర్డు దృష్టి సారించిందని వివరించారు. డిసెంబర్ 16న 2027 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం పది జట్లతో కొనసాగుతున్న ఐపీఎల్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ ఉంది. ప్రతి సీజన్‌లోనూ అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు, యువ క్రికెటర్లు పాల్గొంటుండటంతో పోటీ తీవ్రంగా ఉంటోంది. జట్ల సంఖ్య పెరిగితే మరిన్ని నగరాలకు ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం కలుగుతుంది. స్థానిక ఆటగాళ్లకు అవకాశాలు పెరగడంతో పాటు అభిమానులకు కూడా అదనపు వినోదం లభిస్తుంది. అయితే జట్ల విస్తరణకు సంబంధించి నిర్వహణ, ఆటగాళ్ల అందుబాటు, మ్యాచ్‌ల సంఖ్య, ప్రసార హక్కులు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.**ఆటగాళ్ల కొనుగోలు నిధిపై ఇంకా నిర్ణయం లేదు**ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఆటగాళ్ల కొనుగోలు కోసం కేటాయించే నిధి (పర్స్) పెంపుపైనా ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఒక్కో జట్టుకు రూ.125 కోట్లుగా ఉన్న పర్స్‌ను రూ.150 కోట్లకు పెంచనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే దీనిపై కూడా బీసీసీఐ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సైకియా తెలిపారు. 2027 సీజన్ అనంతరం జరిగే మెగా వేలానికి ముందు ఈ అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.పర్స్ పెంపు జరిగితే ఫ్రాంచైజీలు మరింత మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయ ఆటగాళ్లతో పాటు దేశీయ యువ క్రికెటర్లకు కూడా మంచి ధర లభించే అవకాశం ఉంటుంది. అయితే అన్ని జట్లకు సమాన అవకాశాలు ఉండేలా బీసీసీఐ విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.**ఐపీఎల్ నిర్వహణలో మార్పులపైనా ఆసక్తి**ఐపీఎల్ నిర్వహణ సమయాన్ని మార్చి జనవరి నెలలో నిర్వహించాలన్న ప్రతిపాదనపై కూడా గతంలో చర్చలు జరిగాయి. అయితే దీనిపై సైకియా స్పష్టమైన వివరాలు వెల్లడించలేదు. సాధారణంగా మార్చి నుంచి మే వరకు ఐపీఎల్ నిర్వహిస్తుండగా, అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, వాతావరణ పరిస్థితులు, ఇతర దేశాల క్రికెట్ లీగ్‌లతో పోటీ వంటి అంశాలు నిర్వహణ తేదీలను నిర్ణయించడంలో కీలకంగా ఉంటాయి.ఐపీఎల్‌లో జట్ల సంఖ్య పెంపు అనేది కేవలం ఫ్రాంచైజీలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఆటగాళ్ల ఎంపిక, మ్యాచ్‌ల సంఖ్య, మైదానాల లభ్యత, ప్రసార సంస్థల ఒప్పందాలు, ఆర్థిక నిర్వహణ వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. అందువల్ల బీసీసీఐ అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే విస్తరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.**ప్రస్తుతానికి పది జట్లతోనే ఐపీఎల్**బీసీసీఐ తాజా ప్రకటనతో 2028 నుంచి ఐపీఎల్‌లో 12 జట్లు ఉంటాయన్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడింది. కొత్త జట్ల చేరికపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడంతో ప్రస్తుతం పది జట్లతోనే ఐపీఎల్ కొనసాగనుంది. భవిష్యత్తులో జట్ల విస్తరణపై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అప్పటివరకు అభిమానులు కొత్త జట్ల గురించి వస్తున్న వార్తలను అధికారిక ప్రకటనలుగా భావించకూడదు. ఐపీఎల్ 20వ సీజన్‌ను విజయవంతంగా నిర్వహించడమే ప్రస్తుతం బీసీసీఐ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

ఆసియా కప్ ఫైనల్‌కు భారత్!

- అఫ్గానిస్థాన్‌పై 8 వికెట్ల ఘన విజయం.. పాక్‌తో తుది పోరు



అల్ అమరాత్: అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు సత్తా చాటింది. సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. తొలుత బౌలింగ్‌లో రాణించిన భారత కుర్రాళ్లు.. అనంతరం బ్యాటింగ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో లక్ష్యాన్ని సులభంగా ఛేదించారు.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. నోమన్ సలార్జాయ్ (51), షా ఫైసల్ రహీమీ (51) అర్ధసెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ మూడు వికెట్లు పడగొట్టగా, ఆర్యన్ సావ్‌సాని రెండు వికెట్లు తీశాడు. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 36.5 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. కెప్టెన్ లక్ష్య రాజేష్ రైచందాని అద్భుతంగా ఆడి 90 బంతుల్లో 93 పరుగులు చేశాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ 57 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.అనంతరం వినీత్, యశ్వర్ధన్ చౌహాన్ జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ విజయంతో భారత్ ఫైనల్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. గత ఫైనల్‌లో పాక్ చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం భారత యువ జట్టుకు లభించింది. ఈ నెల 14న జరగనున్న తుదిపోరుపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

గోల్ఫ్‌లో అభిషేక్ రెడ్డి అరుదైన ఘనత!

ఒకే షాట్‌తో హోల్ ఇన్ వన్ నమోదు.. తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఆటగాడు



హైదరాబాద్: గోల్ఫ్ క్రీడలో అత్యంత అరుదుగా నమోదయ్యే ఘనతను తెలంగాణకు చెందిన గోల్ఫర్ కంకణాల అభిషేక్ రెడ్డి సాధించాడు. తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (టీపీజీఎల్) 2026 పోటీల్లో భాగంగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఒకే షాట్‌తో బంతిని నేరుగా హోల్‌లోకి పంపించి 'హోల్ ఇన్ వన్' నమోదు చేశాడు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌లో జరిగిన ఈ పోటీల్లో అభిషేక్ ప్రదర్శన క్రీడాభిమానులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 11వ హోల్‌పై అతను సాధించిన ఈ ఘనత టోర్నీలో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.మైసా (మీూూా) జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అభిషేక్ రెడ్డి తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. గోల్ఫ్‌లో ప్రతి హోల్‌కు నిర్దేశించిన దూరం, ఆటగాడి నైపుణ్యం, బంతిని సరైన దిశలో పంపించే సామర్థ్యం ఎంతో కీలకం. సాధారణంగా ఒక హోల్‌ను పూర్తి చేయడానికి ఆటగాళ్లు పలు షాట్లు ఆడాల్సి ఉంటుంది. అయితే బంతిని మొదటి షాట్‌లోనే నేరుగా హోల్‌లోకి పంపించడం అత్యంత అరుదైన విషయం. అలాంటి ఘనతను అభిషేక్ రెడ్డి సాధించడం విశేషం.**ఏమిటీ హోల్ ఇన్ వన్?**గోల్ఫ్ క్రీడలో బంతిని టీ నుంచి కొట్టి, నిర్దేశించిన గుంతలోకి చేర్చాల్సి ఉంటుంది. ఆటగాడు వేసిన తొలి షాట్‌కే బంతి నేరుగా గుంతలో పడితే దానిని 'హోల్ ఇన్ వన్' అంటారు. ఇందుకు ఆటగాడి ఏకాగ్రత, అంచనా, షాట్‌పై నియంత్రణ, అనుభవం అవసరం. కొన్నిసార్లు అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కూడా ఇలాంటి అవకాశం రావడానికి చాలా కాలం పడుతుంది. అందుకే గోల్ఫ్‌లో హోల్ ఇన్ వన్‌ను ప్రత్యేక విజయంగా పరిగణిస్తారు.**క్వార్టర్ ఫైనల్లో హోరాహోరీ పోటీ**టీపీజీఎల్ క్వార్టర్ ఫైనల్ పోటీల్లో పలు జట్లు తమ ప్రతిభను చాటుకున్నాయి. జై రాజ్ స్టీలర్స్ జట్టు 42తో జీఎంఆర్ ఎలిగాన్స్‌పై విజయం సాధించింది. ఎజైల్ వ్యాలీ వారియర్స్ 3.52.5తో హుల్డీ ఫెయిర్‌వేస్‌ను ఓడించింది. లండన్ రాయల్స్ జట్టు 51తో జీఎన్ఐటీఎస్ లహరి లయన్స్‌పై ఆధిపత్యం ప్రదర్శించింది. మరో పోటీలో ఐరోకో లార్వెన్ అవెంజర్స్ 42తో మైసా జట్టుపై గెలుపొందింది. దీంతో జై రాజ్ స్టీలర్స్, ఎజైల్ వ్యాలీ వారియర్స్, లండన్ రాయల్స్, ఐరోకో లార్వెన్ అవెంజర్స్ జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి.మైసా జట్టు క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైనప్పటికీ అభిషేక్ రెడ్డి సాధించిన వ్యక్తిగత ఘనత అందరి దృష్టిని ఆకర్షించింది. జట్టు ఫలితంతో సంబంధం లేకుండా తన ప్రతిభను చాటుకున్నాడు. టోర్నీలో ఇలాంటి అరుదైన ఘనత నమోదు కావడం గోల్ఫ్ అభిమానులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది. **యువ గోల్ఫర్లకు స్ఫూర్తి**గోల్ఫ్ వంటి క్రీడల్లో ప్రతిభతో పాటు నిరంతర సాధన, క్రమశిక్షణ, సహనం ఎంతో అవసరం. ప్రతి షాట్‌ను జాగ్రత్తగా అంచనా వేసి ఆడాల్సి ఉంటుంది.

ఆఫ్ఘన్‌తో భారత యువజట్టుకు కఠిన పరీక్ష!

- అండర్-19 ఆసియా కప్ సెమీఫైనల్లో నేడు అమీతుమీ.. ఫైనల్ బెర్తే లక్ష్యంగా బరిలోకి భారత్

మస్కట్: అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ క్రికెట్ జట్టుకు కీలక సమరం ఎదురైంది. టోర్నీలో భాగంగా గురువారం జరిగే తొలి సెమీఫైనల్లో పటిష్టమైన ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో భారత్ తలపడనుంది. గ్రూప్ దశలో మంచి ప్రదర్శనతో సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టు.. అదే జోరును కొనసాగించి ఫైనల్ బెర్తును ఖాయం చేసుకోవాలని పట్టుదలతో ఉంది.భారత జట్టుకు ఈ పోరు అంత సులభం కాబోదు. ఆఫ్ఘనిస్తాన్ యువ ఆటగాళ్లు ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్, దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు. దీంతో భారత బ్యాటర్లు ఆఫ్ఘన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆరంభంలో వికెట్లు కోల్పోకుండా జాగ్రత్తగా ఆడటంతో పాటు అవసరమైన సమయంలో వేగంగా పరుగులు సాధించడం కీలకం కానుంది.భారత జట్టులో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకం కనిపిస్తోంది. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని నాయకత్వంలో యువ ఆటగాళ్లు సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. కీలక సమయంలో బాధ్యత తీసుకునే ఆటగాళ్ల ప్రదర్శనే మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించి ఆడగలిగితే భారత్‌కు విజయావకాశాలు మెరుగవుతాయి.మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు కూడా ఫైనల్ చేరాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. భారత జట్టును నిలువరించేందుకు ప్రత్యేక వ్యూహాలతో సిద్ధమవుతోంది. దీంతో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఫైనల్‌కు అర్హత సాధించనుండటంతో యువ ఆటగాళ్లకు ఇది కీలక పరీక్షగా మారింది.**ఫైనల్‌పై భారత్ గురి** ఈ టోర్నీలో టైటిల్ సాధించాలంటే సెమీఫైనల్ అడ్డంకిని అధిగమించడం భారత్‌కు తప్పనిసరి. యువ ఆటగాళ్ల ప్రతిభకు ఈ పోరు మరో పరీక్ష కానుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ సమష్టిగా రాణిస్తే ఫైనల్ చేరడం భారత్‌కు సాధ్యమే. అయితే తాజా పరిణామాల ప్రకారం భారత్ ఆఫ్ఘనిస్తాన్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. శనివారం జరిగే తుది పోరులో పాకిస్థాన్‌తో తలపడనుంది.

ఆఫ్ఘన్‌తో భారత యువజట్టుకు కఠిన పరీక్ష!

- అండర్-19 ఆసియా కప్ సెమీఫైనల్లో నేడు అమీతుమీ.. ఫైనల్ బెర్తే లక్ష్యంగా బరిలోకి భారత్

మస్కట్: అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ క్రికెట్ జట్టుకు కీలక సమరం ఎదురైంది. టోర్నీలో భాగంగా గురువారం జరిగే తొలి సెమీఫైనల్లో పటిష్టమైన ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో భారత్ తలపడనుంది. గ్రూప్ దశలో మంచి ప్రదర్శనతో సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టు.. అదే జోరును కొనసాగించి ఫైనల్ బెర్తును ఖాయం చేసుకోవాలని పట్టుదలతో ఉంది.భారత జట్టుకు ఈ పోరు అంత సులభం కాబోదు. ఆఫ్ఘనిస్తాన్ యువ ఆటగాళ్లు ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్, దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు. దీంతో భారత బ్యాటర్లు ఆఫ్ఘన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆరంభంలో వికెట్లు కోల్పోకుండా జాగ్రత్తగా ఆడటంతో పాటు అవసరమైన సమయంలో వేగంగా పరుగులు సాధించడం కీలకం కానుంది.భారత జట్టులో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకం కనిపిస్తోంది. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని నాయకత్వంలో యువ ఆటగాళ్లు సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. కీలక సమయంలో బాధ్యత తీసుకునే ఆటగాళ్ల ప్రదర్శనే మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించి ఆడగలిగితే భారత్‌కు విజయావకాశాలు మెరుగవుతాయి.మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు కూడా ఫైనల్ చేరాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. భారత జట్టును నిలువరించేందుకు ప్రత్యేక వ్యూహాలతో సిద్ధమవుతోంది. దీంతో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఫైనల్‌కు అర్హత సాధించనుండటంతో యువ



ఆటగాళ్లకు ఇది కీలక పరీక్షగా మారింది.**ఫైనల్‌పై భారత్ గురి** ఈ టోర్నీలో టైటిల్ సాధించాలంటే సెమీఫైనల్ అడ్డంకిని అధిగమించడం భారత్‌కు తప్పనిసరి. యువ ఆటగాళ్ల ప్రతిభకు ఈ పోరు మరో పరీక్ష కానుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ సమష్టిగా రాణిస్తే ఫైనల్ చేరడం భారత్‌కు సాధ్యమే. అయితే తాజా పరిణామాల ప్రకారం భారత్ ఆఫ్ఘనిస్తాన్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. శనివారం జరిగే తుది పోరులో పాకిస్థాన్‌తో తలపడనుంది.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్' విడుదల తేదీ ఖరారు..

సత్యతో కలిసి కామెడీ పంచేందుకు రెడీ



హాస్య నటుడు అల్లరి నరేశ్ మరోసారి ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఆల్కహాల్' డిసెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ గురువారం ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విడుదల తేదీని వెల్లడిస్తూ పోస్టు పెట్టింది.

గతేడాది విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచింది. ఇందులో అల్లరి నరేశ్ పాత్ర మద్యానికి పూర్తిగా దూరంగా ఉండే వ్యక్తిగా కనిపిస్తుంది. టీజర్‌లో సత్య, అల్లరి నరేశ్ మధ్య జరిగే సంభాషణలు నవ్వులు పూయించాయి. లక్షలు సంపాదిస్తున్నా ఎందుకు మద్యం తాగవని సత్య ప్రశ్నించగా.. సంపాదనకు, మద్యం తాగడానికి సంబంధమేంటని నరేశ్ ఎదురు ప్రశ్నిస్తాడు.

తాను మద్యం తాగకపోవడానికి కారణం చెబుతూ.. తాగితే తన నియంత్రణలో తాను ఉండలేనని, మద్యం తనను శాసించడం ఇష్టం లేదని అంటాడు. చివర్లో సత్య మద్యం మానేశానని చెప్పగా.. తన స్నేహితులు తాగుతారని నరేశ్ బదులివ్వడం, వారు తాగకపోతే తాగించేలా చేయమని చెప్పడం టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మెహర్ తేజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అల్లరి నరేశ్‌తో పాటు రుహానీ శర్మ, నిహారిక ఎన్ఎం, సత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గిరీశ్ కులకర్ణి, హర్షవర్ధన్, చైతన్య కృష్ణ, రవీంద్ర విజయ్, రఘుబాబు, వెంకటేశ్ కాకుమాను, కిరీటి, హరితేజ, సూర్య భగవాన్ దాస్, ఫ్లోరా జాకబ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

సినిమాకు గిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, నేపథ్య సంగీత బాధ్యతలు చైతన్ భరద్వాజ్ చేపట్టారు. జిజు సన్నీ కెమెరా, నిరంజన్ దేవరమనే ఎడిటింగ్ అందిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.

నవ్విస్తూనే ఆలోచింపజేసేలా..

'ఇడుపు కాయితం' టీజర్



విలక్షణ నటుడు ప్రియదర్శి, నూతన నటి నాగదుర్గ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సరదా కుటుంబ కథా చిత్రంపై టీజర్ అంచనాలను పెంచుతోంది.

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారి మాటలతో ప్రారంభమైన ఈ టీజర్, శ్రీను (ప్రియదర్శి), శ్రీలత (నాగదుర్గ) పాత్రల మధ్య ప్రేమ, పెళ్లి ప్రస్తావన, వివాహ వేడుకలు, కుటుంబ సభ్యుల మధ్య జరిగే హాస్యభరిత సన్నివేశాలతో సరదాగా సాగింది. అయితే, తెలంగాణ మాండలికంలో 'ఇడుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం. పెళ్లి బంధంతో మొదలైన కథ, విడాకుల వరకు ఎందుకు వెళ్లిందనే ఆసక్తిని రేకెత్తించేలా టీజర్‌ను తీర్చిదిద్దారు. సంతోషంగా సాగిపోతున్న వీరి జీవితంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయనేది కథలో కీలక అంశంగా కనిపిస్తోంది.తెలంగాణ జానపద సంగీతం, నృత్యంతో ఎంతో ప్రాచుర్యం పొందిన నాగదుర్గ ఈ సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయం అవుతుండటం విశేషం. వంశీ రెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సురేశ్ బొబ్బిలి అందించిన సంగీతం ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా నుంచి విడుదలైన 'శ్రీలత', 'గడప' పాటలతో పాటు దీపావళికి రిలీజ్ చేసిన ఎనర్జిటిక్ 'బరాత్ బీట్' పాటకు కూడా మంచి స్పందన లభించింది.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సుకుమార్, బన్నీ వాస్ వంటి అగ్ర నిర్మాతలు అందిస్తున్న సినిమా కావడంతో 'ఇడుపు కాయితం'పై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఇద్దరు పిల్లల తల్లిగా సాయిపల్లవి



ఓకే బంగారం– చిత్రంలో నిత్యా మీనన్ పాత్రను ఎంతో అద్భుతంగా చూపించిన మణిరత్నం నుంచి ఇప్పుడు మరో అద్భుతమైన రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా కాన్సెప్ట్ సినిమాగా రూపొందుతోంది. –ఇంజి వెల్లం– టైటిల్ తో రూపొందుతున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి లాంటి జాతీయ ఉత్తమ నటుడి సరసన సాయిపల్లవి కథానాయికగా నటిస్తోంది. ఆసక్తికరంగా ఈ చిత్రంలో సాయిపల్లవి గృహిణిగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా నటిస్తోంది. కోల్ కత బ్యాక్ డ్రాప్ లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి మణిరత్నం లాంటి స్టార్ డైరెక్టర్ రచన, దర్శకత్వం వహిస్తుండటంతో దీనిపై చాలా చర్చ సాగుతోంది. అయితే దర్శకదిగ్గజం ఈ ట్యాలెంటెడ్ నటి పాత్రను ఎలా మలిచారో అనే చర్చ కొనసాగుతోంది.మణిరత్నం తన సినిమాల్లో నాయకానాయికల మధ్య రొమాంటిక్ కోణాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తారు. అలాంటి ఆవిష్కరణలు గతంలో ఎన్నో. ఆయన సినిమాల్లో నాయికల పాత్రలు కేవలం గ్లామర్ కోసమే ఉండవు. కథను ముందుకు నడిపించే ఆత్మలా ఉంటాయి. –ఓకే బంగారం– చిత్రంలో నిత్యా మీనన్ పాత్ర ఒక అర్బన్ ఆర్కిటెక్ట్‌గా, రిలేషన్‌షిప్‌పై స్పష్టమైన అభిప్రాయాలున్న మోడరన్ అమ్మాయిగా ఎంత సహజంగా కనిపిస్తుందో, మనసు విరిగినప్పుడు అంతే తీవ్రంగా స్పందిస్తుంది. ఇప్పుడు –ఇంజి వెల్లం–లో సాయిపల్లవి పాత్రను కూడా అదే స్థాయిలో ఎలాంటి కృత్రిమత్వం లేని సహజమైన పాత్రగా మణిరత్నం మలచినట్లు తెలుస్తోంది.ఇప్పటివరకు సాయిపల్లవి ఎక్కువగా కాలేజీ స్టూడెంట్ గా డాన్సర్ గా లేదా స్వతంత్ర భావాలున్న యువతి పాత్రల్లోనే ఎక్కువగా మెప్పించారు. అయితే అందుకు భిన్నంగా పరిణతి చెందిన గృహిణిగా నటిస్తుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇద్దరు పిల్లల తల్లిగా నటించడం సవాల్ అయినా కానీ.. దానిని నిరూపిస్తుందనే నమ్మకం ఉంది. సాయి పల్లవి నిజానికి కళ్లతోనే భావాలను అద్భుతంగా పలికించగలదు గనుక ఈ పాత్రకు ప్లస్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక విజయ్ సేతుపతితో పోటీపడుతూ అద్భుతమైన నటనను కనబరిచేందుకు ఆస్కారం ఉంది. ఈ ఇద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ క్రేజీ చిత్రానికి ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండటం మరో ప్రధాన ఆకర్షణ. –ఇంజి వెల్లం– ప్రపంచవ్యాప్తంగా 2027 జనవరి 29న థియేటర్లలో విడుదల కానుంది. నితీష్ తివారీ –రామాయణం–లో సీత పాత్రతో చర్చల్లో నిలిచిన సాయిపల్లవి తదుపరి మణిరత్నం సినిమాతో పాటు, అమరన్ దర్శకుడితో సినిమాలోను ఛాలెంజింగ్ పాత్రలు పోషిస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది.

అయ్యప్ప దయ వల్ల అందరం క్షేమంగా ఉన్నాం : శేఖర్ మాస్టర్

శంషాబాద్ ముచ్చింతల్ సమీపంలో శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం

అతివేగంగా వచ్చిన పండ్ల లోడు లారీ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన వైనం

ప్రమాద తీవ్రతకు పూర్తిగా నుజ్జునుజ్జైన కారు వెనుక భాగం



టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ దుర్ఘటనలో ఆయనతో పాటు కారులో ఉన్న మరో ముగ్గురు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న చిత్రం 'కాకా'లో ఒక పాటకు సంబంధించిన నైట్ షూటింగ్ ముగించుకుని, శేఖర్ మాస్టర్ తన బృందంతో కలిసి కారులో తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ వద్దకు చేరుకోగానే... ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన పండ్ల లోడు లారీ వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు వెనుక భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అయితే, కారులోని శేఖర్ మాస్టర్‌తో పాటు ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఈ ప్రమాదంపై శేఖర్ మాస్టర్ ఒక వీడియో సందేశం ద్వారా స్పందిస్తూ... "కాకా సాంగ్ షూటింగ్ ని ముగించుకొని తిరిగి వస్తుంటే తెల్లవారుజామున 6 గంటలకు కారు యాక్సిడెంట్ కి గురైంది. కారు వెనక భాగం పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో కారులో మేము నలుగురం ఉన్నాం.. అయ్యప్ప దయ వల్లే మాకు ఏమీ జరగలేదు. అందరూ నాకు ఏమైందో అని మెసేజ్ లు చేస్తున్నారు. నేను క్షేమంగా ఉన్నాను. మాతో పాటు ఉన్నవారు కూడా క్షేమంగా ఉన్నారు. ఈరోజు రాత్రికి కూడా షూటింగ్ ఉంది. దానికి బయల్దేరుతున్నాను" అని తెలిపారు.ఇటీవలే అయ్యప్ప స్వామి మాల ధరించిన శేఖర్ మాస్టర్.. స్వామివారి ఆశీస్సుల వల్లే ఇంతటి ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డామని భావోద్వేగంతో వెల్లడించారు. తామంతా క్షేమంగా ఉన్నామని చెప్పడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఊపిరి పీల్చుకున్నారు.

నాని సినిమా టీంపై బాబు మోహన్ ఫైర్.. కర్మ ఫలం అంటూ సంచలన వ్యాఖ్యలు!



నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్' సినిమా మేకర్స్‌పై సీనియర్ హాస్యనటుడు బాబు మోహన్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ చిత్ర యూనిట్ తనను అవమానించిందని, అందుకే వారికి 'కర్మ' తగిలి సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బాబు మోహన్ ఈ విషయాలను వెల్లడించారు.సికింద్రాబాద్ నేపథ్యంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమాలో ఓ ముఖ్యమైన పాత్ర కోసం చిత్ర యూనిట్ తనను సంప్రదించిందని బాబు మోహన్ తెలిపారు. "నాకు లుక్ టెస్ట్ చేశారు. మేకప్ వేసి, పలు రకాల కాస్ట్యూమ్స్ ప్రయత్నించారు. ఈ పాత్రకు మీరే సరిగ్గా సరిపోయారని మెచ్చుకున్నారు. షూటింగ్ మొదలైనప్పుడు కచ్చితంగా పిలుస్తామని చెప్పారు. కానీ ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదు" అని ఆయన వివరించారు.

సినిమా విడుదలయ్యే వరకు తాను వారి నుంచి పిలుపు కోసం ఎదురుచూశానని, అయితే ఎలాంటి స్పందన రాలేదని బాబు మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవేళ నన్ను ఆ పాత్రకు తీసుకోకపోయినా, కనీసం ఆ ఒక్క మాట చెప్పే మర్యాద పాటించాల్సింది. అది కూడా చేయకుండా అవమానించారు" అని ఆయన అన్నారు.చిత్రం బాక్సాఫీస్ వద్ద నిజాం ఏరియా మినహా మిగతా ప్రాంతాల్లో పెద్దగా ఆడలేదని, కథనం నెమ్మదిగా ఉందనే విమర్శలు వచ్చాయని బాబు మోహన్ చురకలు అంటించారు. పరిశ్రమలో తనను చాలామంది 'లక్కీ లెగ్'గా భావిస్తారని, గతంలో తాను లేని కొన్ని చిత్రాలు ఫ్లాప్ అయిన సందర్భాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఈ సినిమాకు కూడా అదే జరిగిందని, వారికి కర్మ ఫలం దక్కిందని వ్యాఖ్యానించారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, నాని హీరోగా వచ్చిన 'ది ప్యారడైజ్ ' చిత్రం విడుదలకు ముందు మంచి అంచనాలు రేపినప్పటికీ, ఆ తర్వాత ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. బాబు మోహన్ చేసిన ఈ వ్యాఖ్యలపై చిత్ర యూనిట్ ఇంకా స్పందించలేదు.